క్లుప్తంగా

బెదిరింపు కాల్స్‌పై ఫిర్యాదు



ఆర్మూర్‌టౌన్: గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లో బెదిరించడంపై ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహనాయుడు శనివారం ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబుకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి అంతుచూస్తామని బెదిరించారని ఆయన పోలీసులకు వివరించారు.

ఆలయాన్ని పునర్నిర్మించాలి



రుద్రూర్: మండల కేంద్రంలో జీర్ణోద్ధరణకు గురైన లక్ష్మీవేంకటేశ్వర ఆలయాన్ని పునర్నిర్మించాలని భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తీర్మానించారు. ఆలయంలో శనివారం వారు సమావేశం నిర్వహించి, పునఃనిర్మాణం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

బోధన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఏసీపీ కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను, సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బంది డ్యూటీల గురించి సీఐ ప్రేమ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పలువురు సిబ్బందికి రివార్డును అందజేశారు.

నిజాయితీ చాటిన ఆటో డ్రైవర్

మోర్తాడ్: మండలంలోని వడ్యాట్‌కు చెందిన ఆటో డ్రైవర్ గుండేటి గంగాధర్ తనకు దొరికిన ఫోన్‌ను యజమానికి అందించి, నిజాయితీని చాటుకున్నాడు. వడ్యాట్ శివారులోని శుక్రవారం దేవి ఆలయం వద్ద మోర్తాడ్‌కు చెందిన రాజన్న ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఫోన్ గంగాధర్‌కు దొరకగా యజమాని కోసం వెతికి శనివారం ఫోన్‌ను అప్పగించాడు.

రిలే దీక్షల విరమణ



రుద్రూర్: మండల కేంద్రంలోని గ్రంథాలయ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ బహుజన స్త్రీ శక్తి మహిళ మండలి సభ్యులు పదిహేడు రోజులుగా చేపట్టిన రిలే దీక్షలను శనివారం విరమించారు. గ్రంథాలయం కోసం 22ఏళ్ల క్రితం అప్పటి పాలకవర్గం చేసిన తీర్మాన ప్రతులను జీపీ కార్యదర్శి విఠల్ రెడ్డి వారికి అందజేశారు. దీంతో వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు మహిళలకు జ్యూస్ అందచేసి దీక్షలను విరమింప చేశారు.

యూత్ కాంగ్రెస్ నేతల అరెస్టు

బోధన్‌టౌన్(బోధన్): ప్రగతి భవన్ ముట్టడికి తరలివెళ్లనున్న యూత్ కాంగ్రెస్ నాయకులను శనివారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో మైనార్టీసెల్ జిల్లా వైస్ చైర్మన్ సాజిద్, నాయకులు ప్రమోద్, రిజ్వాన్ ఉన్నారు.

కౌమారదశలో మార్పులపై అవగాహన సదస్సు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలంలోని ఆలూర్, దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శనివారం వర్ద్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కౌమారదశలో కలిగే మార్పులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం హరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్పపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- భైరి నరేష్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలి
- హిందూ సంఘాలు, అయ్యప్ప స్వాముల డిమాండ్
- రెండోరోజూ కొనసాగిన నిరసనలు

మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/రెంజల్/మోర్తాడ్/కమ్మర్‌పల్లి/పెర్కిట్: హిందూ దేవుళ్లు, అయ్యప్ప స్వామిపై నాస్తిక సంఘం నాయకుడు భైరి నరేశ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అయ్యప్ప స్వాములు, హిందూ సంఘాల నాయకులు పేర్కొన్నారు. వెంటనే అతడిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం రెండోరోజు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో అయ్యప్ప స్వాములు, హిందూ సంఘాల నాయకులు నిరసనలు చేపట్టారు. ప్రధాన రహదారులపై రాస్తారోకో చేపట్టారు. స్థానిక పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పలు మండల కేంద్రాల్లో భైరి నరేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పలు మండలాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన పర్స భార్గవ్ ఫేస్‌బుక్‌లో భైరి నరేష్‌కు అనుకూలంగా పోస్టు చేయడంతో అతడి ఇంటిని అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు ముట్టడించారు. దీంతో భార్గవ్ క్షమాపణ కోరుతూ సందేశం పోస్టు చేయడంతో స్వాములు శాంతించి వెనుదిరిగారు.



మాక్లూర్‌లో రాస్తారోకో చేస్తున్న అయ్యప్ప స్వాములు





ఆర్మూర్‌లో హిందూ ధర్మ ద్రోహుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హిందూ సంఘాల నేతలు.. నందిపేటలో..



బషీరాబాద్‌లోని పర్స భార్గవ్ ఇంటి వద్ద అయ్యప్పస్వాములు



రెంజల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు



మోర్తాడ్ మండల కేంద్రంలో..

సామాన్యులకు అండగా ఎన్నో చట్టాలు





ఎక్లాస్‌పూర్‌లో మాట్లాడుతున్న సంక్షేమ శాఖ అధికారి నరహరి.. కళ్యాపూర్ గ్రామంలో..

కోటగిరి: సామాన్య ప్రజలకు న్యాయం లభించేలా ప్రభుత్వం ఎన్నో చట్టాలను రూపొందించిందని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నరహరి పేర్కొన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో శనివారం ఎస్సీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మానవ హక్కుల సభ నిర్వహించారు. ఈసందర్భంగా నరహరి మాట్లాడుతూ.. పేదల కోసం కోర్టుల్లో న్యాయ సహాయ కేంద్రాలు (లీగల్ ఎయిడ్స్ సెంటర్స్) ఉన్నాయన్నారు. ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ గంగాధర్, ఆర్‌ఐ సహీద్, సెక్రెటరీ స్వాతి ఉన్నారు.

రెంజల్ మండలంలో..

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాంచందర్, ఎస్సై పండ్ల సాయన్న మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వార సమాజంలో అందరు సమానమేనని వివరించారు. మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ కాశం సాయిలు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బడిలో టీఎల్‌ఎం తయారుచేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో శాంతకుమారి

రుద్రూర్: మండలంలోని ప్రతి పాఠశాలలో టీఎల్‌ఎం (టీచింగ్, లెర్నింగ్ మెటిరీయల్) తయారు చేయాలని ఎంఈవో శాంతకుమారి సూచించారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో మాట్లాడారు. జనవరి 4న మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో టీఎల్‌ఎం మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మేళాకు ప్రతి స్కూల్ నుంచి 4 టీఎల్‌ఎం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రాజ్ మంజూష, సీఆర్‌పీలు అంబర్‌సింగ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు పుస్తకాల అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో అవేర్‌నెస్, స్కిల్ డవలప్‌మెంట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు చేపూర్ గణేష్, ప్రతాప్, వేణు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో న్యూ ఇయర్ వేడుకలు..

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు.

బోధన్‌లో న్యూ ఇయర్ జోష్..

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లో శనివారం న్యూ ఇయర్ జోష్ నెలకొంది. నూతన సంవత్సరం పురస్కరించుకొని ప్రజలు కేక్‌ల కోసం పట్టణంలోని బేకరీల వద్ద బారులు తీరారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు బిజీగా మారాయి.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

మాక్లూర్: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పీఆర్టీయూ క్యాలెండర్‌ను మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎస్సై యాదగిరిగౌడ్ ఆవిష్కరించారు.పీఆర్టీయూ మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం చదవాలి

వేల్పూర్: ఎస్సెస్సీ విద్యార్థులు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం చదవాలని పచ్చలనడ్కుడ హైస్కూలు హెచ్‌ఎం సురేష్ పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం అందజేయాలన్నారు.

13వ రోజుకు చేరిన దీక్షలు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌ను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తు బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారం 13వ రోజుకు చేరుకున్నాయి. బార్ అసోసియేష్ అధ్యక్షుడు గంగారెడ్డి మాట్లాడుతూ.. 2వ తేదీన దీక్షా శిబిరం వద్ద వంటా-వార్పు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుంకరి అమూల్య జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్వీ హన్మంత్ రెడ్డి, మల్లేష్ గౌడ్ శనివారం తెలిపారు. ఢిల్లీలో జనవరి 3నుంచి నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో అమూల్య రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.

లీడ్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు లీడ్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజులదేవి రామకృష్ణ తెలిపారు. విద్యార్థులు శౌర్య, కవిత సమర్పించిన సైన్స్ ప్రాజెక్టులకు ప్రథమ అవార్డు లభించినట్లు తెలిపారు. పాఠశాలలో శనివారం విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

ఉత్తమ ర్యాంకర్‌కు సన్మానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన మృదుపాని ఇటీవల విడుదలైన ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ యూపీఎస్సీ పరీక్ష ఫలితాల్లో ఆల్‌ఇండియా లెవెల్‌లో 21వ ర్యాంకు సాధించింది. ఈసందర్భంగా శనివారం కాలనీవాసులు మృదుపానిని సన్మానించారు.

జోనల్ క్రీడల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్‌లో శ్రీ చైతన్య యాజమాన్యం ఆధ్వర్యంలో రాజారాం స్టేడియం నాగారంలో నిర్వహించిన జోనల్ క్రీడోత్సవాల్లో ఆర్మూర్ శ్రీ చైతన్య విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్ ముత్తు శనివారం తెలిపారు. ఖోకో, వాలీబాల్, క్యారమ్స్, చెస్‌లో ప్రతిభ చూపారన్నారు. విజేతలకు జెడ్మీ చైర్మన్ విఠల్‌రావు బహుమతులు అందజేశారన్నారు.

ఆధ్యాత్మికం..

- ఘనంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



బాల్కొండ: మండల కేంద్రంలో శనివారం అయ్యప్ప మాలధారణ స్వాములు అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. మణికంఠుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- కొనసాగుతున్న భాగవత కథా పారాయణం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్షత్రీయ ఫంక్షన్ హాల్‌లో శనివారం తొమ్మిదవ రోజు భాగవత కథా పారాయణం కొనసాగింది. భగవత్ కథతో పాటు కృష్ణ జననం, కృష్ణ-రుక్మిణిల కల్యాణ ఘట్టాలను పరమానంద్‌జీ మహారాజ్ వివరించారు. అనంతరం మార్వాడి భక్తులు దాండియా ఆడుతూ ఆనందంగా గడిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నూతన కార్యవర్గం..

- బీఎల్‌ఎఫ్ నియోజకవర్గ కమిటీ..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ నియోజకవర్గ బీఎల్‌ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనర్‌గా దండు జ్యోతి, కో-కన్వీనర్‌లుగా రాజు, బోదాస్ నర్సయ్య, మాజీద్, పట్టణ కన్వీనర్‌గా లావణ్య, కో-కన్వీనర్‌గా హన్మంతు, నందిపేట్ మండల కన్వీనర్‌గా గంగాధర్ ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నిర్మాణంలో భాగంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అందుబాటులో వర్మి కంపోస్టు

పెర్కిట్(ఆర్మూర్): యాసంగిలో పంటలను సాగు చేసే రైతులకు వర్మి కంపోస్టును అందుబాటులో ఉంచినట్లు ఆలూర్ సర్పంచ్ కల్లెం మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు ఆలూర్ గ్రామ పంచాయతీలో సంప్రదించాలని సర్పంచ్ కోరారు.